About School....

# 'విజయ' పథంలో.....



"Each of us has a list of lovely things" అంటూ 'The unwritten registry' చెబుతాడో ఆంగ్లకవి.

అలాంటి నా మధురానుభూతుల జాబితాలో 'విజయ్' తాలూకు జ్ఞాపకాలదే అగ్రస్థానం. పాతికేళ్ళ 'విజయ్' ప్రస్థానంలో ఇరవై ఏళ్ల నుండి నాకా సంస్థతో అనుబంధం ఉంది.

డిగ్రీ పూర్తయ్యాక పోటీపరీక్షల ఫీజులకీ, పుస్తకాలకీ సాయంగా ఉంటుందని క్లర్కుగా నిజామాబాద్, విజయ్ పబ్లిక్ స్కూల్ లో 1986లో చేరా.

ఇప్పుడున్న వాళ్లలో ఆనాటికి ఉన్నది ముగ్గురు వి.(వసంత) పి.(ప్రభాదేవి) యస్.(సుజాత) మేడమ్స్ కాక... రేఖామేడం, మంజుల ఆయా, సర్వర్ డ్రైవర్ మాత్రమే. రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తర్వాత వచ్చారు.

వారం పది రోజులు క్లర్కుగా పని చేసాక, ఓ టీచరు వెళ్ళిపోతే ఆ స్థానంలో నన్ను తీసుకున్నారు. ఆ రోజున టీచరుగానే జీవితంలో స్థిరపడబోతున్నానని నేను ఊహించలేదు. జీవితాన్ని చాలా తేలిగ్గా తీసుకొనే ఇరవై ఒక్కేళ్ళ వయసది.

ఓసారి ప్రభామేడం అన్నారు కూడా - "పొరపాటు చేశాం. కనీసం పాతికేళ్ళైనా లేని వాళ్ళని ఇకపై టీచరుగా తీసుకోవద్దు" అని. కానీ తొందర్లోనే ఆమె కనిపెట్టారు నాలో ఉన్న నాకే తెలీని ఏదో 'స్పార్క్'ని వెలికి తీసారు. వసంతామేడం, సుజాతామేడం ప్రోత్సాహమిచ్చారు. అమృతామేడం అభయ మిచ్చారు. తారామేడం తదితరులు ఆదరించారు.

అప్పుడే బోధనారంగం పట్ల ఆసక్తి కలగడం మొదలైంది. బి.ఎడ్ ఎంట్రన్స్‌కి నోటిఫికేషన్ పడింది. ఎంట్రన్స్ వ్రాస్తే సీటొచ్చింది. అడ్మిషన్స్ తంతంతా ముగిసేసరికి, ఓ విద్యా సంవత్సరం గడిచి పోయింది. ఏప్రిల్ 1987లో బి.ఎడ్ లో చేరా. డిసెంబర్ కల్లా అయిపోయింది.

యూనివర్సిటీలో ఉన్న మిత్రులు అక్కడే ఉండి పోటీ పరీక్షలకి ప్రిపేరవమన్నారు. ఖర్చులకి డబ్బులొద్దా అంటే - హైదరాబాద్‌లో పేరున్న మంచి ప్రైవేట్ స్కూల్‌కి తీసుకెళ్ళారు. 'విజయ్'లో కన్నా చాలా ఎక్కువ జీతం. ఫలానా రోజున జాయినవ్వాలన్నారు. కానీ తీవ్ర అంతర్మథనం. కన్నతల్లి లాంటి 'విజయ్' ని మర్చిపోవడమా అని - ఫ్రెండ్స్‌కి చెప్పాపెట్టకుండా వచ్చి మళ్ళీ 'విజయ్' లో చేరా - మనసు కుదుటపడింది.

విజయ్‌లో నిండా మూడేళ్ళు కూడా పని చేయలేదు. కానీ ఎన్నెన్నో అనుభూతులు - మొదటి టెన్త్ బ్యాచ్ మా చేతుల మీదుగానే వెళ్ళింది. 1988, 89లో నిజామాబాద్ విజయ్ పబ్లిక్ స్కూల్లో టెన్త్ చదివిన పిల్లల పేర్లన్నీ ఇప్పటికీ నోటికి గుర్తుంటాయి.

పిల్లల్తో అంతటి అటాచ్‌మెంట్ ఉండేది. మిత్రుడు సంజీవరెడ్డి (అప్పటి నా కొలీగ్) అయితే రూల్ నెంబర్లతో సహాచెప్తాడు. పదిహేనేళ్ళు దాటినా ఇంతగా గుర్తున్నాయంటే 'విజయ్' లో చూపే వ్యక్తిగత శ్రద్ధ, Teacher-taught relationship ఎంత గొప్పగా ఉంటాయో అర్థం చేసుకోవచ్చు.

నా సబ్జెక్టు లెక్కలు. కానీ టైం టేబుల్‌ని బేలన్సింగ్ చేయడానికి నాకే సబ్జెక్టయినా ఇచ్చి చెప్పమనేవారు. మేనేజ్‌మెంట్‌కి నామీదంత నమ్మకం. టైం టేబుల్ తయారీలో నేనో పెద్ద వెసులు బాటన్న మాట! అది డీయస్సీలో నాకెంతో ఉపయోగపడింది. డీయస్సీ అప్పట్లో Descriptive type లో ఉండేది. హిందీ - తప్ప స్కూల్ సబ్జెక్టులన్నీ ఉండేవి. వందల మంది వ్రాసిన ఆ పరీక్షల్లో మొదటి పాతికలోపు ఉంటేనే ఉద్యోగమొచ్చే పరిస్థితిది - ఉద్యోగం వస్తే డైరెక్ట్‌గా స్కేలే. రెండేళ్ళ పాటు నామ మాత్ర వేతనానికి పని చేసే అవసరం లేదు.

విజయ్ హైస్కూల్లో పాఠాలు చెప్పడమే పెద్ద ప్రిపరేషన్. డీయస్సీకి ప్రత్యేకంగా ప్రిపేర్ కావల్సిన అవసరం రాలేదు. డీయస్సీలో నాలుగో ర్యాంక్ వచ్చింది. అదంతా విజయ్ చలవే. మనసులో ఎంత 'విజయ్' లోనే కొనసాగాలని ఉన్నా అనేకానేక కారణాలవల్ల గవర్నమెంట్ ఉద్యోగంలో చేరాల్సి వచ్చింది. అలా 1989 జూలై 31న 'విజయ్' ను వదిలి వెళ్ళాను.

'విజయ్'లో నాతో పాటు పనిచేసిన ఇంకో నలుగురు మిత్రులకీ నాకూ కలిపి యాజమాన్యం ఫేర్‌వెల్ పార్టీ ఏర్పాటు చేసింది. ఉద్విగ్నభరితక్షణాలవి. పిల్లలైతే వలవలా ఏడ్చేసారు. ఎంత ప్రయత్నించినా మేమూ కంట్రోల్ చేసుకోలేక పోయాం. ఓ అమ్మాయి అయితే ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడిపోయింది కూడా.

'విజయ్' లో అప్పట్లో ఓ నిర్దిష్ట కాలానికి పని చేసిన వాళ్ళకే వేసవి జీతం ఇచ్చేవారు. నేను మధ్యలో ఆరేడు నెలలు బి.ఎడ్ కి వెళ్ళడం వల్ల ఆ 'నిర్దిష్ట' కాలపరిమితి సరిపోక వేసవి జీతం ఇవ్వలేమన్నారు. అమృతా మేడం దగ్గరికి వెళ్ళడానికి అంతా భయపడేవాళ్ళు. నేను వెళ్ళా భయపడ్తూనే - సాదరంగా మట్లాడారు. భయం పోయింది. 'నేను ఈ స్కూల్‌నే నమ్ముకున్నా. ఇంతకన్నా ఎక్కువ జీతం ఇస్తామనే ఆఫర్స్ ఉన్నా వేరే చోటికి వెళ్ళలేదు. నాకు వేసవి వేతనం ఇప్పించండి' అని - 'సరే తీసుకోండి' అన్నారు. అప్పుడన్పించింది - ఆమె నిజంగా 'అమృత'మూర్తి అని.

అమృతా మేడం గురించి ఎంత చెప్పినా తక్కువే. అత్యద్భుత ప్రతిభాపాటవాలు ఆమె సొంతం. ఆమెకి తెలియని విషయం లేదేమో అనిపిస్తుంది. 'Versatile' అనే మాటకి పర్యాయపదం. నాకు తెలిసిన వాళ్ళలో Decision making లో She is the best. మనుషుల్ని అంచనావేయడంలో ఆమె తరువాతే ఎవరైనా. సునిశిత పరిశీలనా, సూక్ష్మ గ్రాహ్యతా, హేతుబద్ధతా, తార్కిక చింతనా ఆమె సహజ లక్షణాలు. ఆమె 'finds' అనేకులు - ఆమె fans అసంఖ్యాకులు.

ఓ టాలెంట్ షోకి అభినందన్‌తో దుర్యోధన ఏకపాత్రాభినయం చేయించమని నాకు ఆదేశం. నాకేమో అసలే టచ్‌లేని ఫీల్డది. 'దాన వీర శూర కర్ణ' మళ్ళీ మళ్ళీ చూసి ఎన్టీయార్‌ని అనుకరింప జేయడానికి ప్రయత్నించా. కానీ స్వతహాగా ఒరిజినాల్టీ కలిగిన ఆ కుర్రాడేమో తన స్వంత స్టయిల్లో రిహార్సల్స్ చేయసాగాడు. తలుచుకొన్నప్పుడల్లా నవ్వొస్తుంది. నా అశక్తతని గమనించి అమృతా మేడం డైరక్టర్ని మార్చి నన్ను బతికించారు.

వాడిగా, వేడిగా స్టాఫ్ రూంలో సాగే సబ్జెక్టు చర్చలూ, డెమాన్‌స్ట్రేషన్ క్లాసులూ - వాటిపైనా విమర్శనాత్మక చర్చలూ, నా బోటి రంధ్రాన్వేషకుల కామెంట్లూ - అప్పుడప్పుడూ సరదాగా చేసే పిక్నిక్కులూ, ప్రతిసారీ ప్రభామేడం 'ద గ్రేటెస్ట్ ఎంటర్ టైనర్' గా పేరు తెచ్చుకోవడం, సుజాత మేడం, వసంతా మేడంలు గంభీరంగా ఉంటూనే అప్పుడప్పుడూ చెణుకులు విసరడం- క్లాసు ఖాళీగా ఉంటే అది తీసుకోవడా నికి పోటీలు పడడం, ఆహ్లాద కరపు సాయంకాలాల్లో ట్యుటోరియల్స్ నిర్వహించడం.... ఇలా ఎన్నెన్నో జ్ఞాపకాలు.

కొన్నాళ్ళ క్రితం హైదరాబాద్‌లో ఓ అబ్బాయి కన్పించాడు. నమస్కారం చేసి మీ విద్యార్థినని చెప్పాడు. ఏదో కంపెనీలో మంచి పొజిషన్లో ఉన్నాడట. పేరూ, వివరాలు చెప్పాడు కానీ గుర్తు రావట్లేదు. అభినందన్, సుజిత్ వాళ్ళ క్లాసట - ఆరో తరగతిలో వాళ్ళకు నేను లెక్కలు చెప్పేవాడ్ని.

'We have achieved something in our lives because you taught us basics right' అన్నాడు. ఆశ్చర్యకరంగా సత్యకుమారీ ఇవే మాటలంది. రెండేళ్ళ క్రితం టీచర్స్ యూనియన్ తరపున ఊళ్ళు తిరిగినపుడు ఓ స్కూల్లో సత్య కనిపించింది.... పదిహేనేళ్ళ తర్వాత! 'విజయ్' లో ఆమెపట్ల అందరిలోనూ సాఫ్ట్ కార్నర్ ఉండేది. ఈమె ఇంకా ఉన్నత స్థానంలో ఉండాల్సిందేమో అన్పించింది. కానీ తనకెంతో ఇష్టమైన ప్రొఫెషన్లో స్థిరపడ్డందుకు ఆనందంగా ఉందంది. ఏ మాస్కోలోనో ఓ తెలుగు వాడికి మరో తెలుగు వాడు తారసపడ్డప్పుడు కలిగే సంతోషం లాంటిది కలిగింది.

'భ్రమర కీటక న్యాయం' గుర్తొచ్చింది. అజిత్, సుజాత, పద్మశ్రీలు కలిసినా అంతే.



Contd....

కళ్యాణ్, హరీష్, శీతల్, శ్రీధర్, భరత్, నళినీమోహన్ ఇలా ఎందరెందరో 'విజయ్' తాలూకు విజయ చిహ్నాలు ఉన్నత స్థానాల్లో ఉన్నారు. ఇన్నేళ్ళయినా చాలా మంది పూర్వ విద్యార్థులు తమకు చిన్నప్పుడు పాఠాలు చెప్పిన ఉపాధ్యాయుల్నీ, యాజమాన్యాన్నీ వెదుక్కుంటూ వచ్చి తమ పెళ్ళిళ్ళకు పిలవడం 'విజయ్' ఘనతే.

మీ పిల్లలు ఏ స్కూల్లో చదువుతున్నారు. అనే ప్రశ్నకి 'విజయ్'లో అన్న సమాధానమివ్వగానే చాలా మంది 'ఫలానా' స్కూల్లో ఎందుకు చేర్చలేదు అనడిగేవాళ్ళు. చిరునవ్వు నవ్వి ఊరుకునే వాడ్ని.

అంతకన్నా ఏం సమాధానమివ్వగలను? ఇది నా మాతృసంస్థ అని చెప్పనా? ఇక్కడైతే నా పిల్లల భవిష్యత్తు భద్రంగా ఉంటుందని చెప్పనా? నా పిల్లలకి ఏ చిన్న సమస్య వచ్చినా క్షణాల్లో తీర్చేవాళ్ళు ఇక్కడున్నారని చెప్పనా? విజయ్ నిఖార్సయిన బంగారమని చెప్పనా ?

నేను చాలా దగ్గర్నుంచి గమనించాను. గణితం, సైన్స్‌ల్లో 'విజయ్' పిల్లల స్థాయి ఎక్కువ. అందుకు కాబోలు - ఇంటర్ తర్వాత ఉన్నత విద్యా సంస్థల్లో విజయ్ ప్రొడక్ట్స్ సంఖ్య చాలా ఎక్కువగా వుంటోంది. మిగతా స్కూళ్ళ పిల్లల్ని వేళ్ళమీద లెఖ్ఖెట్టొచ్చు. విజయ్ లాంటి క్రమశిక్షణాయుతమైన సంస్థాగత నిర్వహణ వేరేచోట కన్పించదు.

మొన్న వేసవిలో ఓ 'సెట్' నిర్వహించాల్సి వచ్చింది. నిజామాబాద్ విజయ్ పబ్లిక్ స్కూల్ వెనుక బిల్డింగ్ (ఇది వరకటి 'లా' కాలేజీ బిల్డింగ్) మాకు అలాటయిన సెంటర్, పరీక్ష ముందురోజున వెళ్ళాం. రమణా, తారామేడం కలిశారు. విషయం చెప్పాం. గదులు చూసుకోవడానికి వెళ్ళాం. సెలవుల మూలాన వెనుక బిల్డింగ్ వాడుకలో లేదేమో! మెట్లూ కారిడార్ గదులూ అన్నీ - రాలిన చెట్ల ఆకుల్తోనూ, ధూళితోనూ నిండి ఉన్నాయి.

పరీక్ష రోజు ప్రొద్దునే ఏర్పాట్లు చూసుకోవడానికి వెళ్ళాం. ఆశ్చర్యం ! ముందు రోజున బూత్ బంగ్లాలా ఉంటే - ఇప్పుడేమో పవిత్రమైన దేవాలయంలా ఉంది. ఆయాలు కొన్ని గంటల పాటు శ్రమించి ఉంటారు. పరీక్ష ప్రారంభం నుండి అయిపోయేదాకా ఓ ఇద్దరు ఆయాలు సుశిక్షితులైన సైనికుల్లా పనిచేసారు. ప్యాకింగ్ సమయంలో మంజుల వచ్చి, మాకు సాయపడింది. వాళ్ళ పనితనం చూసి ఆఫీసర్లూ ఇన్విజిలేటర్లూ చాలా ఆశ్చర్యపోయారు. "That's all about 'Vijay' in a nut shell" అని వాళ్ళతో చెప్పా.

అన్నీ ఒకెత్తు - టాలెంట్‌షోకి ఏర్పాట్లూ, నిర్వహణా మరోఎత్తు! దానికోసం ఎంత శ్రమించేదీ, తపించేదీ ప్రత్యక్షంగా చూసిన అనుభవం నాకుంది. కానీ ప్రేక్షకుల దృష్టి కోణంలోంచి చూస్తే ఆ శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయ్యేది. ప్రేక్షకులకి సరిగా కన్పించేది కాదు. స్టాఫ్‌కీ, వాలంటీర్స్‌కీ జనం కంట్రోలయ్యే వాళ్ళుకాదు. మొట్టమొదటి సారిగా 2003 టాలెంట్‌షో అందర్నీ ఆకట్టుకుంది. పెద్ద స్క్రీన్స్‌ని క్లోజ్డ్ సర్క్యూట్ పద్ధతిలో అమర్చడం వల్ల అంతా సరిగ్గా చూడగలిగారు. ఎవ్వరికీ కుర్చీల మీదెక్కి చూడాల్సిన అవసరం రాలేదు. క్వాలిటీ పరంగానూ ప్రోగ్రామ్స్ చాలా బావున్నాయి. ప్రతి ప్రోగ్రాంలోనూ మేడం మేధస్సు కన్పించింది.

'విజయ్' లో నాకు నచ్చని అంశాలూ ఉన్నాయి.

ఇతర స్కూళ్ళలాగా పేరెంట్స్‌కి అపాయింట్‌మెంట్ టైమింగ్సంటూ పెట్టక ఎప్పుడొచ్చినా రిసీవ్ చేసుకొని సమస్యల్ని సావధానంగా విని వెంటనే పరిష్కరించడమేంటీ - చులకనైపోరూ?

మదర్స్ గ్యాదరింగే కానీ ఫాదర్స్ బాదరింగ్ మీకు పట్టదా? ఇక్కడా మదర్స్‌దేనా పెత్తనమని ఫాదర్స్ రుసరుసలాడరూ?

'విజయ్' పేరెంట్స్ మధ్య జరిగే సంభాషణల్లో మీ పిల్లలు ఏ క్లాసు అని అడగడానికి ముందు ఏ సెక్షను అనడుగుతుంటారు - మీ ఇంట్లో ఏసీ ఉందా - కంప్యూటర్ ఉందా అనే స్టయిల్లో - ఇదేం సెక్షన్ల పద్ధతండీ ?

అందరూ రోజూ పేపర్లో బాకా ఊదుకుంటూంటే 'విజయ్' మాత్రం పదోతరగతి ఫలితాలొచ్చి పాతబడి పోయాక- తాపీగా ఓ రోజు పేపర్లో ఫోటోలూ, మార్కులూ ఇచ్చేసి చేతులు దులుపుకుంటుంది.

**'ఆరుద్ర సంతకం అఖ్ఖర్లేని కవి' అంటారు. శైలిని బట్టే అది ఆరుద్ర రచన అని చెప్పేయొచ్చు - 'విజయ్' అంతే! అది ప్రచారం అవసరంలేని పాఠశాల - దాని పని తీరే దానికి ప్రచారాస్త్రం.**

**- జి.వి. రమణారెడ్డి**










